
సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 7 । మార్చి । 2025



అడ్డగోలు అడ్మిషన్లకు తెరతీసిన 'ప్రైవేట్' 8లో



భారతీయ మహిళలు ధైర్యవంతులు 8లో



న్యూస్‌రీల్

అనంతుడి పెళ్లిరాటోత్సవం



పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయం వద్ద అనంతుని పెళ్లి రాట

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో గురువారం అనంత పద్మనాభ స్వామి పెళ్లి రాటోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నెల 9 నుంచి 15 వరకు అనంత పద్మనాభస్వామి కల్యాణోత్సవాలు నిర్వహిస్తారు. 10న శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరపనున్నారు. ఈ నేపథ్యంలో పెళ్లి రాట వేశారు. ముందుగా మహిళలు కుంతీ మాధవస్వామి ఆలయం నుంచి పెళ్లిరాటకు సంబంధించి పూజా సామగ్రిని గాలి గోపురం వద్దకు తీసుకొచ్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, భూమి పూజ నిర్వహించి, ఆలయ ప్రధాన అర్చకుడు పి.సీతారామాంజనేయ స్వామి, అర్చకుడు పవన్ ఆధ్వర్యంలో పెళ్లి రాట వేశారు. తదుపరి మహిళలు పసుపు దంచారు. కార్యక్రమంలో పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యులు కంటుబోతు లక్ష్మి, భక్త బృందం సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విద్యా సంస్థలతో పరిశ్రమల సమావేశం నేడు



సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలో విద్యా సంస్థలతో పారిశ్రామిక వ్యవస్థల అనుసంధానంపై శుక్రవారం సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.వి జయబాబు తెలిపారు. ఈమేరకు గురువారం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. వివిధ రంగాలకు చెందిన సుమారు 50 పరిశ్రమలు భాగస్వామ్యం కానున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకునేందుకు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన అవకాశాలకు సదస్సు దోహదపడుతుందన్నారు. పారిశ్రామిక సంస్థలు ఏ అంశాల్లో విద్యార్థుల నైపుణ్యతను ఆశిస్తున్నాయో తెలుసుకునే వీలుంటుందన్నారు. దానికి అనుగుణంగా విద్యార్థులకు విద్యా సంస్థల్లో శిక్షణ అందించి, ఉద్యోగులుగా తీర్చిదిద్దే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

విశాఖ లీగల్ : విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన జిల్లాలో అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటారు ప్రమాదాల నష్టపరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్, బ్యాంకు, మనీ రికవరి కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగదాలు(విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

గురుకుల సీవోఈలో దరఖాస్తుకు గడుపు పెంపు

మధురవాడ: ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొమ్మాది రిక్షా కాలనీలోని విశాఖపట్నం డాక్టర్. బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం(ఇంగ్లీషు మీడియం)లో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచినట్టు ప్రిన్సిపాల్ శాంతికుమారి తెలిపారు. తొలుత మార్చి 6వరకు మాత్రమే అవకాశం ఉందని ప్రకటించగా తాజాగా 13వ తేదీ వరకు పొడిగించారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి విశాఖ జిల్లాకి చెందిన బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. https://apbragcet.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

పుష్ప వర్ణశోభితం









ఉషోదయాన్ని ఆస్వాదించడం అద్భుతమైన అనుభూతి. అలాంటి వేళ రంగురంగుల పువ్వులు, ఆహ్లాదకరమైన వాతావరణం ప్రతి ఒక్కరి మనసునూ ఆనందంతో నింపుతాయి. ఈ అనుభూతిని ప్రత్యక్షంగా ఆస్వాదించాలంటే విశాఖలోని వీఎంఆర్డీఏ పార్కుకు వెళ్లాల్సిందే. ఇక్కడి పార్కులో విరబూసిన సప్తవర్ణాల పుష్పాలు సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. అనేక రకాల మొక్కలు అందమైన పువ్వులతో నిండి చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ఉదయం వేళల్లో వాకర్లు నడుస్తూ వెళ్తుంటే, దారి పక్కనే ఉన్న ఈ సుందరమైన పుష్పాలు, వాటి నుంచి వచ్చే సువాసనలు వారి మనసుకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నాయి. అంతేకాదు, ఈ పువ్వులలోని మకరందాన్ని దోచుకోవడానికి వచ్చే తుమ్మెదలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. - ఏయూక్యాంపస్







ఉక్కు ఉద్యమంపై షోకాజ్!



- నినదించే గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్న స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం
- స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీసు
- యాజమాన్య వైఖరికి నిరసనగా నేడు స్టీల్ సీఐటీయూ ధర్నా

సాక్షి, విశాఖపట్నం : విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ఎలా గాడిలో పెట్టాలన్నదానిపై ఆలోచనలు చేయకుండా.. ఉక్కు భవిష్యత్తు కోసం పోరాడుతున్న వారిపై జులుం ప్రదర్శించడంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అత్యుత్సాహం చూపిస్తోంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ని ఎలాగైనా కాపాడుకోవాలన్న ఉక్కు సంకల్పంతో పోరాటం చేస్తున్న ఉద్యమ నాయకుల్ని భయపెట్టేందుకు యాజమాన్యం షోకాజ్‌లు జారీ చేస్తోంది. ఆది నుంచి పోరుబాటలో ముందున్న స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తూ షోకాజ్ నోటీసు జారీ చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

నిరంతర పోరాటాల వల్లే..

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం కేంద్ర ప్రభుత్వం నోట నుంచి వచ్చినప్పటి నుంచి ఉద్యమ జ్వాల ఎగసిపడింది. అప్పటి నుంచి విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు అన్ని సంఘాలు అలుపెరగని పోరాటం చేస్తున్నాయి. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం, నిరంతరం రోడ్లపై ఉద్యోగ కార్మిక సంఘాలు పోరాటం చేయడం వల్ల.. నాలుగేళ్లుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ జోలికి కేంద్రం రాలేకపోయింది. తాజాగా దిద్దుబాటు చర్యలు చేపడుతున్నట్లుగా రూ.11 వేల కోట్లు ప్యాకేజీని ప్రకటించింది. తాత్కాలిక ఉపశమనం కల్పించినా.. ఆర్ఐఎన్ఎల్‌కు ప్రైవేటీకరణ ముప్పు మాత్రం ఇంకా పొంచి ఉండటంతో ఉద్యమ నాయకులు పోరాటం ఆపలేదు. అయితే స్టీల్‌ప్లాంట్ గురించి ఎక్కడా మాట్లాడకూడదు.. వీఆర్ఎస్, హెచ్ఆర్ఏ, ఉద్యోగులు, కార్మికుల జీతాల కోసం ఎక్కడా నోరు మెదపకూడదంటూ యాజమాన్యం ఆంక్షలు విధించింది. అయినా.. కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు ఎక్కడా వెనకడుగు వేయకుండా హెచ్ఆర్ఏ, విద్యుత్ చార్జీలు, వీఆర్ఎస్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై నిరంతరం రోడ్డెక్కి పోరాడుతున్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్‌కు యాజమాన్యం గురువారం షోకాజ్ నోటీసు జారీ చేసింది. కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా సీఐటీయూ గౌరవాధ్యక్షునిగా ప్రచారం చేశారంటూ మండిపడుతూ.. ఈ చర్యలపై ఏడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఎంఎంఎస్ఎం డిపార్ట్‌మెంట్ డిసిప్లినరీ అథారిటీ డీజీఎం(ఎలక్ట్రికల్) ఉమాకాంత్ గుప్తా నోటీసులో పేర్కొన్నారు.

యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ..

స్టీల్ యాజమాన్యం అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీస్ ఇవ్వడంపై సీఐటీయూ శ్రేణులు మండిపడుతున్నాయి. అధికారుల చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం వద్ద ధర్నా చేస్తామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రామస్వామి తెలిపారు. నోటీసులు వెనక్కు తీసుకునేంత వరకూ ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

ఉక్కును కాపాడుకోవడమే నా విధానం : అయోధ్యరామ్



స్టీల్‌ప్లాంట్ నోటీసులపై స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్ గట్టిగానే స్పందించారు. నోటీసులతో గొంతు నొక్కాలని ప్రయత్నిస్తే.. వేల గొంతులు ఒక్కటై పిక్కటిల్లేలా ఉద్యమిస్తామని హెచ్చరించారు. నోటీసుకు ప్రతిస్పందనగా యాజమాన్యానికి లేఖ రాశారు. కార్మికులు, ఉద్యోగుల హక్కుల గురించి పోరాడటమే తన విధానమనీ.. స్టీల్‌ప్లాంట్‌ని కాపాడుకునేంత వరకూ రోడ్డెక్కి ఉద్యమిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. సీఐటీయూ నాయకునిగా కార్మికుల సమస్యలపై పోరాడటం తమ బాధ్యత అన్నారు. నోటీసులో పేర్కొన్న సమస్యలపై తమ పోరాటం కొనసాగిస్తామే తప్ప భయపడేది లేదని తెగేసి చెప్పారు.

చందనోత్సవ ఏర్పాట్లపై ముందస్తు సమీక్ష

- త్వరలో కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం
- సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు



దేవస్థానం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఈవో సుబ్బారావు

సింహాచలం: వచ్చే నెల 8న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం, 30న జరిగే చందనోత్సవంలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహిస్తామని సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు తెలిపారు. ఈ వేడుకల నిర్వహణపై దేవస్థానం విభాగాధిపతులతో గురువారం ముందస్తు సమీక్ష నిర్వహించారు. గత చందనోత్సవాల్లో చోటుచేసుకున్న లోటుపాట్లపై చర్చించారు. వాటిని పునరావృతం కానీయరాదన్నారు. వారం రోజులపాటు జరిగే వార్షిక కల్యాణోత్సవాల్లో వైదిక కార్యక్రమాలు, చందనోత్సవం రోజు జరిగే వైదిక కార్యక్రమాలపై ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసచార్యులతో చర్చించారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని సూచించారు. క్యూల ఏర్పాటు, శానిటేషన్, ఇంజినీరింగ్ పనులు, అన్నదానం తదితర పనులపై కూలంకషంగా చర్చించారు. త్వరలోనే జిల్లా కలెక్టర్‌తో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈ హరి, ఏఈవో శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు నరసింగరావు, రాజ్యలక్ష్మి, త్రిమూర్తులు, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కులాలకు వైన్‌షాపుల కేటాయింపు



లాటరీ తీస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాఖ సిటీ: కల్లుగీత కులాలకు వైన్‌షాప్‌ల లాటరీ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సాయంత్రం 4 గంటలకు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ చేతుల మీదుగా లాటరీ తీసి షాపులను కేటాయించారు. జిల్లాలో మొత్తం 14 షాపులకు గాను 316 దరఖాస్తులు వచ్చాయి. జీవీఎంసీ పరిధిలో ఉన్న 11 షాపుల్లో గౌడ, యాత కులాలకు ఒక్కోటి, శెట్టిబలిజకు తొమ్మిది, ఆనందపురంలో ఒకటి గౌడకు, భీమిలి, పద్మనాభం మండలాల్లో ఒక్కోటి శెట్టిబలిజకు కేటాయించారు. వీరిలో కొందరు రెండు, మూడు దరఖాస్తులు చేశారు. మొత్తంగా 121 మంది 14 షాపుల కోసం తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. జీవీఎంసీ పరిధిలో ఒక షాపు కోసం మొత్తం 35 దరఖాస్తులు రావడం గమనార్హం. దరఖాస్తుల రూపంలోనే ప్రభుత్వానికి రూ.6.32 కోట్లు ఆదాయం సమకూరింది. దరఖాస్తుదారుల సమక్షంలో జాయింట్ కలెక్టర్ లాటరీ తీసి షాపులు పొందిన వారి పేర్లను ప్రకటించారు. షాపులు దక్కించుకున్న 14 మంది తొలి వాయిదా కింద మొత్తంగా రూ.94,16,750 చెల్లించారు. వీరికి ప్రొవిజినల్ లైసెన్సులు మంజూరు చేశారు. ఈ లాటరీ ప్రక్రియలో ప్రొహిబిషనల్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు 14న నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సొంత గనులు కేటాయించి సెయిల్‌లో విలీనం చేయాలన్న డిమాండ్లతో ఈ నెల 14న అఖిల పక్ష కార్మిక ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టాలని విజయవాడలో జరిగిన రాష్ట్ర జేఏసీ సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు విశాఖ జిల్లాలో నిరసన ప్రదర్శనలు జయప్రదం చేసేందుకు కార్యాచరణపై సిటూ కార్యాలయంలో అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ గురువారం సమావేశమైంది. సమావేశంలో జేఏసీ చైర్మన్ మరడాన జగ్గునాయుడు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తామని ప్రకటించిన నుంచి ఇప్పటి వరకు జేఏసీ ఆధ్వర్యంలో పోరాడుతున్నామన్నారు. కార్మికుల సమస్యలపై మాట్లాడినందుకు యూనియన్ గౌరవ అధ్యక్షుడు అయోధ్యరామ్‌కి షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని జేఏసీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ నెల 14న జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి నిర్వహించనున్న నిరసన ప్రదర్శనలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఏపీఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దేవా, సీఎఫ్‌టీయూఐ జిల్లా కార్యదర్శి లక్ష్మి, ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ కమిటీ కో కన్వీనర్ కుమార మంగళం, శ్రామిక మహిళా కన్వీనర్ పి.మణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఐజే నాయుడు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్, మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జనతాబజార్‌లో జెడ్సీ పేరుతో దందా

అడ్డంగా బుక్కైన అసోసియేషన్ నాయకులు

జగదాంబ: జనతా బజార్‌లో జోనల్ కమిషనర్ పేరుతో జరుగుతున్న వసూళ్ల దందా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జీవీఎంసీ జోన్-4 పరిధిలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న జనతా బజార్‌లో అసోసియేషన్ నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఇరువర్గాల తగాదాలో బయటపడింది. 72 దుకాణాలు కలిగిన ఈ బజారు సముదాయం నుంచి జీవీఎంసీకి రూ.9కోట్లకు పైగా అద్దె బకాయిలు పేరుకుపోయాయి. బకాయిల వసూలుకు జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు బుధవారం సిబ్బందితో బజార్‌కు వచ్చారు. బకాయిలు వెంటనే చెల్లించాలని, లేదంటే దుకాణాలు ఖాళీ చేయాల్సి వస్తుందని వ్యాపారులను హెచ్చరించి వెళ్లారు. ఇది జనతా బజార్ వ్యాపారులకు, అసోసియేషన్ నాయకులకు మధ్య చిచ్చు రేపింది. 'అద్దె చెల్లింపులకు జోనల్ కమిషనర్ నుంచి సమయం తీసుకువస్తామని నమ్మించి, నెల నెలా జెడ్సీ పేరుతో డబ్బులు వసూలు చేశారు. ఇప్పుడు జెడ్సీ ఎందుకు వచ్చారు.' అని వ్యాపారులు అసోసియేషన్ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెలలో ఒక్కో దుకాణం నుంచి రూ.10వేల చొప్పున రూ.3లక్షల వరకు బలవంతంగా వసూలు చేశారని వ్యాపారులు ఆరోపించారు. వసూలు చేసిన డబ్బుల లెక్కలు తేల్చాలని నిలదీయడంతో తోపులాట జరిగింది. ఈ ఘర్షణతో అసోసియేషన్ నాయకుల గుట్టు రట్టయింది. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ తన పేరుతో డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. జనతా బజార్‌లో వేలం పాటలు లేకుండా అక్రమంగా దుకాణాలను అద్దెలకు ఇస్తున్న వారిపై కూడా చర్యలు తప్పవన్నారు. కార్పొరేషన్ ఆస్తిని అక్రమంగా అనుభవిస్తూ.. పైగా జోనల్ కమిషనర్ పేరును ఉపయోగించుకుని మోసం చేసిన వారిని వదిలిపెట్టేదిలేదన్నారు.

దారి తప్పిన 'మహా ప్రస్థానం'

- మృతదేహాల తరలింపునకు రూ.2 వేలు వసూలు చేస్తున్న వాహన డ్రైవర్లు
- వాస్తవానికి ఈ తరలింపు పూర్తి ఉచితం
- వాహనాల నిర్వహణ బాధ్యత కేజీహెచ్‌దే..
- కానీ మరణించిన వారి కుటుంబ సభ్యుల నుంచి దౌర్జన్యంగా డబ్బుల వసూళ్లు



మహారాణిపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మరణించిన నిరుపేద రోగుల మృతదేహాలను ఉచితంగా వారి స్వగ్రామాలకు తరలించేందుకు ప్రభుత్వం మహా ప్రస్థానం వాహనాలను ప్రవేశపెట్టింది. అయితే అవి నేడు కొందరి అత్యాశకు దారి తప్పుతున్నాయి. ఉచితంగా అందించాల్సిన సేవలకు సైతం కొందరు డ్రైవర్లు డబ్బులు వసూలు చేస్తూ పేద ప్రజలను మరింత బాధిస్తున్నారు. ఒక్కో మృతదేహాన్ని తరలించేందుకు రూ. 2వేల నుంచి రూ. 3 వేల వరకు దౌర్జన్యంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2017లో పేద ప్రజలకు మృతదేహాల తరలింపు భారం కాకూడదని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. ప్రైవేట్ వాహనాలు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న నేపథ్యంలో మహాప్రస్థానం వాహనాల ద్వారా ఉచితంగా మృతదేహాలను తరలించే సౌకర్యాన్ని కల్పించింది. కేజీహెచ్‌లో ప్రారంభంలో ఆరు వాహనాలను ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం వాటి సంఖ్యను తొమ్మిదికి పెంచారు. రోజుకు 25 నుంచి 30 మృతదేహాలను ఈ వాహనాల ద్వారా తరలిస్తున్నారు.

అయితే కొందరు డ్రైవర్లు మాత్రం నిబంధనలను తుంగలో తొక్కి, ఉచితంగా అందించాల్సిన సేవలకు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆస్పత్రుల్లో, రోడ్డు ప్రమాదాల్లో, ఎంఎల్‌సీ కేసుల్లో మరణించిన వారి బంధువుల నుంచి బలవంతంగా డబ్బులు గుంజుతున్నారని సమాచారం. డబ్బులు ఇవ్వకపోతే మృతదేహాలను మధ్యలోనే వదిలి వెళ్లిపోతామని బెదిరింపులకు దిగుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న బాధిత కుటుంబ సభ్యులు డ్రైవర్లు అడిగినంత డబ్బులు ఇవ్వాల్సి వస్తోంది. వాస్తవానికి కేజీహెచ్ నుంచి అనకాపల్లి, విజయనగరం వరకు మహాప్రస్థానం వాహనాల ద్వారా ఉచితంగా మృతదేహాలను తరలించేందుకు అనుమతి ఉంది. అంతేకాకుండా మృతుల బంధువుల అభ్యర్థన మేరకు, సంబంధిత అధికారుల అనుమతితో అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లాలకు కూడా ఈ వాహనాల ద్వారా మృతదేహాలను తరలిస్తున్నారు. వాహనాల డ్రైవర్ల జీతాలు, ఇంధన ఖర్చులు, ఇతర నిర్వహణ ఖర్చులను ఇంటిగ్రేటెడ్ హెల్త్ గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా ప్రభుత్వం చెల్లిస్తోంది. పేద ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తుంటారు. వీరు ఆర్థికంగా చితికిపోయి ఉంటారు. ఇటీవల ఓ తండ్రి తన కుమారుడి మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై పాడేరుకు తీసుకువెళ్లిన సంఘటన పేదల కష్టాలను కళ్లకు కట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో.. మహాప్రస్థానం వాహనాల డ్రైవర్లు డబ్బులు డిమాండ్ చేయడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై ఎన్ని ఫిర్యాదులు వెళ్లినా అధికారులు పట్టించుకోవడం లేదని రోగుల బంధువులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పేదలను దోచుకుంటున్న డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: పీఎం ఇంటర్న్‌షిప్ స్కీం-2025 నమోదు ఈనెల 12తో ముగియనుందని, అర్హులైన వారు pminternship. mca. gov. in లో దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ లేబర్ కమిషనర్ ఎం.రామారావు తెలిపారు. అక్కయ్యపాలెంలోని కార్మిక శాఖ కార్యాలయంలో గురువారం యూనియన్ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎం ఇంటర్న్ షిప్ ఏడాది కాలం వ్యవధి ఉంటుందని, ప్రతి నెలా రూ.5వేల ఆర్థిక సాయంతో పాటు మరో రూ.6 వేలు ఒకసారి ఆర్థిక సాయం అందిస్తారని తెలిపారు.

వీఎంఆర్డీఏ తహసీల్దార్‌పై ఫిర్యాదులు

విశాఖ సిటీ: వీఎంఆర్డీఏలో తహసీల్దార్(భూసేకరణ)గా విధులు నిర్వర్తిస్తున్న కోరాడ వేణుగోపాల్‌పై వరుస ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆయన ఎస్.రాయవరం మండలం తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో చేసిన అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆయనపై చట్టపరంగానే కాకుండా సర్వీస్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సీఎం, డిప్యూటీ సీఎం, హెచ్ఆర్‌డీ మంత్రి, డీజీపీ, సీసీఎల్ఏ, ఇతర అధికారులతో పాటు వీఎంఆర్డీఏ చైర్మన్‌కు కూడా రాతపూర్వకంగా ఫిర్యాదులు చేశారు. గతంలో తప్పుడు ధృవపత్రాలు సమర్పించి ఎంపీటీసీ, ఎంపీపీలుగా గెలిచినట్లు నిర్ధారణ అయినప్పటికీ.. ఎన్నికల్లో వారిని అనర్హులుగా ప్రకటించకపోవడంపై వేణుగోపాల్‌పై విచారణ చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. ఆయన ఎస్.రాయవరంలో తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో అనేక అవకతవకలకు పాల్పడి భూ అక్రమాలకు అండగా నిలిచారని.. దీనిపై కూడా విచారించాలని విజ్ఞప్తి చేశారు. ఇటువంటి అవినీతి ఆరోపణలు ఉన్న వేణుగోపాల్‌ను హోం మంత్రి వంగలపూడి అనిత పీఎస్‌గా నియమించాలని ప్రయత్నిస్తుండడం సరైన నిర్ణయం కాదని వారు లేఖలో పేర్కొన్నారు.

మహిళల అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం



మహిళలపై జరుగుతున్న అణచివేత, హింస, దాడులకు వ్యతిరేకంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాలని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ పిలుపునిచ్చారు. 8లో

సమానత్వంతోనే సమాజాభివృద్ధి



సమానత్వంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, మహిళా హక్కులను పోరాడి సాధించుకోవాలని సీఐటీయూ, ఐద్వా, డీవైఎఫ్ఐ ప్రతినిధులు పిలుపునిచ్చారు. 8లో

స్కూటీ అదుపు తప్పి..
మహిళా పోలీస్ దుర్మరణం


మీను(ఫైల్)

మల్కాపురం: స్కూటీ అదుపు తప్పిన ఘటనలో మహిళా పోలీసు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం ఎస్ఐ శ్యామలరావు తెలిపిన వివరాలివి. అంగనపూడి ప్రాంతానికి చెందిన మీను భూషణ్(46) కూర్మన్నపాలెం సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె భర్త స్టీల్‌ప్లాంట్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో మీను భూషణ్ తన కుమార్తెతో కలిసి స్కూటీపై షీలానగర్ నుంచి పోర్టు ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా నగరం వైపు వెళ్తున్నారు. బ్రిడ్జి ఎక్కుతుండగా, ఆమె వెళ్తున్న మార్గంలో ఇద్దరు వ్యక్తులు గడ్డి పట్టుకుని రోడ్డు దాటుతున్నారు. వారిని గుర్తించిన మీను భూషణ్ వెంటనే తన స్కూటీకి అకస్మాత్తుగా బ్రేక్ వేశారు. దీంతో వాహనం అదుపు తప్పి పక్కనున్న డివైడర్‌ను ఆమె ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మీను భూషణ్‌కు తలకు, ఆమె కుమార్తెకు శరీరంపై గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఇద్దరినీ చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మీను భూషణ్ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తండ్రి మృతి

ఆరిలోవ: ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 13వ వార్డు పరిధి దుర్గాబజార్‌లో నివాసముంటున్న బి.మణికంఠ(45) 10వ తరగతి చదువుతున్న తన కుమార్తెను ఫోన్ చూడవద్దంటూ హెచ్చరించారు. దీంతో కుమార్తె నిరాకరించడంతో మనస్తాపంతో ఆయన గత నెల 24న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అప్పటికే కొన ఊపిరితో ఉన్న మణికంఠను కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఆయన మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఆరిలోవ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డగోలు అడ్మిషన్లకు
తెరతీసిన 'ప్రైవేట్'

- సర్కారు చదువులపై నన్నగిల్లుతున్న ఆశలు
- ఇంగ్లిష్ మీడియం చదువులకు మంగళం
- కార్పొరేట్‌కు కొమ్ముకాస్తున్న కూటమి ప్రభుత్వం
- ప్రైవేట్ పాఠశాలలకు క్యూ కడుతున్న విద్యార్థులు
- ఇదే అదునుగా ఫీజులు పెంచేస్తున్న యాజమాన్యాలు


డీఈవో కార్యాలయం

విశాఖ విద్య: విద్యా రంగంపై కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో వెనుకబడిన, నిరుపేద వర్గాలకు చదువులు భారమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ప్రైవేట్ స్కూళ్లు, జూనియర్ కాలేజీలు ఉన్న విశాఖ జిల్లాలో ప్రస్తుతం ఇలాంటి పరిణామాలే చోటుచేసుకుంటున్నాయి. కూటమిలో కొంత మంది పెద్దల సహకారంతో కార్పొరేట్ శక్తులు నగరంలో విద్యా వ్యాపారానికి స్కెచ్ వేస్తున్నాయి. సర్కారు బడుల్లో ఇంగ్లిష్ చదువులు సవ్యంగా సాగకపోవడంతో.. తమ పిల్లల భవిష్యత్ దృష్ట్యా చాలా మంది తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్ల వైపు మొజు చూపిస్తున్నారు.

ఇదిగో సాక్ష్యం

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 1,387 పాఠశాలలు ఉన్నాయి. జిల్లా విద్యాశాఖ లెక్కల ప్రకారం 2024–25 విద్యా సంవత్సరంలో 3,81,262 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ స్కూళ్లు 610 ఉండగా వీటిలో 79,166 మంది చదువుతున్నారు. ప్రైవేట్ స్కూళ్లు 777 ఉండగా, వీటిలో 3,02,096 మంది చదువుతున్నారు. 2023–24లో (వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు) ప్రైవేటు స్కూళ్లలో 2,98,330 మంది ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2024–25లో గతం కంటే 3,766 మంది ఎక్కువగా చేరారు. ప్రభుత్వ స్కూళ్ల నుంచి విద్యార్థులు ప్రైవేటుకు వెళ్లిపోతున్నారనడానికి ఈ అంకెలే నిదర్శనం.

కార్పొరేట్‌కు మేలు చేసేలా స్కూళ్ల రేషనలైజేషన్

కూటమి ప్రభుత్వం 117 జీవో రద్దు పేరిట చేపట్టిన రేషనలైజేషన్‌తో జిల్లాలోని 31 ప్రాథమికోన్నత స్కూళ్లలో 20కు పైగానే ప్రైమరీ స్కూళ్లుగా మారబోతున్నాయి. దీంతో ఇప్పటి వరకు అక్కడ 6,7,8 తరగతులు చదివే విద్యార్థులను ఎగరేసుకుపోయేందుకు సమీపంలోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల నిర్వాహకులు వారి తల్లిదండ్రులతో మంతనాలు మొదలుపెట్టారు. అలాగే మోడల్ స్కూల్ పేరిట, ప్రైమరీ స్కూళ్లలో 3, 4, 5 తరగతులు తీసేస్తుండటంతో.. బస్సులు పెడతాం మా స్కూళ్లకు పంపించండి అంటూ ప్రైవేటు యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయి. ఇలాంటి పరిణామాలతో 2025–26 విద్యా సంవత్సరంలో జిల్లాలో మరింత మంది విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లలో చేరిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

ముందస్తు అడ్మిషన్ల జోరు



ప్రైవేట్ స్కూళ్ల వైపు విద్యార్థులు మొజు చూపిస్తుండటంతో అప్పుడే ముందస్తు ప్రవేశాలు చేస్తున్నారు. ఆ ప్రభావం ఫీజులపై పడింది. నగరంలోని కార్పొరేట్, కొన్ని ప్రైవేట్ స్కూళ్ల వారు గత ఏడాది కంటే అదనంగా రూ.10 వేలు నుంచి రూ.30 వేలు వరకు ఫీజులు పెంచుతున్నారు. ముందే డబ్బులు కట్టి, వచ్చే ఏడాదికి సీటు ఖాయం చేసుకోవాలని విద్యార్థులతో ఇళ్లకు చిట్టీలు సైతం పంపిస్తున్నారు.

ప్రైవేటు దోపిడీని అరికట్టాలి



ప్రైవేటు, స్కూళ్లలో ఫీజులు పెంచుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు చిట్టీలు పంపిస్తున్నారు. దీనిపై విద్యాశాఖాధికారులకు తగిన ఆధారాలతో ఫిర్యాదు కూడా చేశాం. ప్రైవేటు దోపిడీ అరికట్టకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం
–ఎల్‌జే నాయుడు,ఎస్ఎఫ్ఐ కార్యదర్శి

ముందస్తు అడ్మిషన్లు నివారించాలి



ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారు. తమ పరిశీలనలో ఇది తేలింది. దీనిపై విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇలాంటి చర్యలతో ప్రభుత్వ బడులకు ముప్పు వాటిల్లుతుంది. ప్రభుత్వం దీనిపై తగిన చర్యలు తీసుకోవాలి. ముందస్తు అడ్మిషన్లు నివారించేలా చర్యలు తీసుకోవాలి.
– ఉమ్మడి నితిన్, ఏబీవీపీ జిల్లా కార్యదర్శి

చర్యలు తీసుకుంటాం



ముందస్తు అడ్మిషన్లు చేయడానికి వీల్లేదు. ఫీజులు కూడా యాజమాన్యాలు ఇష్టానుసారం పెంచడానికి వీల్లేదు. ఇలాంటి వాటిపై దృష్టి సారిస్తున్నాం. నిబంధనలు అతిక్రమించే స్కూళ్ల గుర్తింపు రద్దు చేయడంతో పాటు, సదరు యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం.
– ఎస్.ప్రేమ్ కుమార్, డీఈవో

నలుగురు నేరస్తుల నగర బహిష్కరణ

అల్లిపురం: నగరంలో ప్రజా జీవనానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ పలు తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులకు నగర బహిష్కరణ విధిస్తూ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధి ఆర్.హెచ్.కాలనీకి చెందిన కొలగాని పవన్ రాజ్ కుమార్ అలియాస్ పవన్, దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి వడ్లపూడికి చెందిన కాండ్రేగుల లోకనాథ్ వీర సాయి శ్రీనివాస్ అలియాస్ లోకేష్, ఎయిర్ పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి ఆర్ అండ్ బీ ప్రాంతానికి చెందిన రావాడ జగదీష్, ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి చినగదిలి ప్రాంతానికి చెందిన నక్కా లోకేష్ అలియాస్ కిట్టులపై ఈ చర్యలు చేపట్టారు. వీరు అక్రమ రవాణా, దోపి డీలు, మాదకద్రవ్యాల వ్యాపారం, గూండాయిజం, అనైతిక కార్యకలాపాలు, భూ కబ్జాలు వంటి అనేక నేరాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. వీరంతా అనేక నేరాల్లో శిక్షలు అనుభవించినప్పటికీ, వారి ప్రవర్తనలో ఏమాత్రం మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సెక్షన్–3(1) అండ్ (2) రెడ్ విత్ సెక్షన్ 2(ఎఫ్) అండ్ 2(జీ) కింద అక్రమ రవాణాదా రులు, దోపిడీదారులు, మాదక ద్రవ్యాల నేరస్తులు, గూండాలు, అనైతిక రవాణా నేరస్తులు, భూ కబ్జాదారుల చట్టం, 1986(చట్టం నం.1) కింద వీరిని ఏడాది పాటు నగరం నుంచి బహిష్కరిస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఎంవీపీకాలనీ: జిల్లా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ తెలిపారు. ఆయా కార్పొరేషన్ల పరిధిలో పలు సామాజిక వర్గాలకు చెందిన 3,596 మందికి శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీ శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, అర్హులైన మహిళలు దరఖాస్తులకు స్థానిక సచివాలయాల్లోని వెల్ఫేర్ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు.

పిల్లల చెంతకు తల్లి


అమ్మును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా టీం సభ్యులు

సీతమ్మధార: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో దిక్కు తోచని స్థితిలో కనిపించిన అమ్ము అనే మహిళకు ఏయూటీడీ సిబ్బంది పునర్జన్మనిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా మూలస్థానం గ్రామానికి చెందిన అమ్ము భర్త తాగుబోతు. ఆయన చిత్రహింసలు భరించలేక మానసిక వేదనకు గురైన ఆమె కొన్నేళ్ల కిందట ఇల్లు వదిలి వెళ్లిపోయింది. స్నేహాలయ సంస్థ సహకారంతో కోలుకుని మేనమామ సంరక్షణలో ఉన్న పిల్లల వద్దకు చేరినా, మందులు మానేయడంతో మూడేళ్ల కిందట మళ్లీ రోడ్డున పడింది. అలా విశాఖ చేరిన ఆమెను ఏయూటీడీ సంస్థ చేరదీసింది. ఆమెను ద్వారకానగర్‌లోని జీవీఎంసీ-ఏయూటీడీ వసతి గృహానికి తరలించి శ్రద్ధా ఫౌండేషన్ ద్వారా వైద్య సహాయం అందించారు. కోలుకున్న అమ్మును గురువారం డిప్లమో చదివిన కుమారుడు, ఇంటర్ చదువుతున్న కుమార్తెకు, వారి మేనమామ సమక్షంలో అప్పగించారు. తమ తల్లి తిరిగి రావడంతో పిల్లలు ఆనందంతో కన్నీరు పెట్టుకున్నారు. ఏయూటీడీ, శ్రద్ధా ఫౌండేషన్ సంస్థలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికునికి గాయాలు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ యుటిలిటీస్ విభాగంలో జరిగిన ప్రమాదంలో కాంట్రాక్ట్ కార్మికునికి గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. విభాగంలో స్కిల్డ్ కార్మికునిగా విధులు నిర్వహిస్తున్న సిహెచ్.ఆనందరెడ్డి (40) గురువారం విభాగంలోని ఏఎస్‌యూ–1 సెక్షన్‌లో పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో ఆక్సిజన్ పంప్ బరస్ట్ అయింది. దీంతో అక్కడ మంటలు చెలరేగాయి. ఈ సంఘటనలో ఆనందరెడ్డికి గాయాలయ్యాయి. వెంటనే అతన్ని ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతనికి సుమారు 40 శాతం గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం భద్రతపై దృష్టి సారించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ చీఫ్ పేట్రన్ నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు.

పినగాడిలో తన్నుకున్న 'తమ్ముళ్లు'

- 'శివుని'ఊరేగింపులో చెలరేగిన వివాదం
- కొట్టుకున్న టీడీపీ రెండు వర్గాల నాయకులు
- పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ
- రాజీకి ముఖ్యనేతల మంతనాలు

పెందుర్తి: పెందుర్తి మండలం పినగాడిలో అధికార తెలుగుదేశం పార్టీలోని వర్గపోరు మరోసారి రోడ్డెక్కింది. గ్రామం నడిబొడ్డున టీడీపీలోని రెండు వర్గాల నాయకులు, కార్యకర్తలు తన్నుకున్నారు. గ్రామంలోని శివాలయం వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి జరిగిన ఊరేగింపులో ఈ ఘటన చోటుచేసుకుంది. పల్లకీ మోయడం విషయంలో తలెత్తిన వివాదంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ వర్గీయులు బాహాబాహీకి దిగారు. ఈ వివాదంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కొట్లాట అనంతరం ఇరు వర్గాల నాయకులు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. అయితే కేసు నమోదు కాకుండా రాజీ కుదిర్చేందుకు ఇరు వర్గాల ముఖ్య నేతలు పోలీసు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

ఇదీ వివాదం.. : పినగాడిలోని బుధవారం శివాలయం వార్షికోత్సవం జరిగింది. రాత్రి 7 గంటల సమయంలో ఆలయం నుంచి శివుని ఉత్సవ మూర్తుల ఊరేగింపు ప్రారంభించారు. రాత్రి 9 దాటాక గ్రామంలోకి ఊరేగింపు ప్రవేశించింది. ఈ క్రమంలో పల్లకీని టీడీపీకి చెందిన ఒకే వర్గం(ఎమ్మెల్యే పంచకర్ల వర్గీయులు) పట్టుకోవడంపై మరో వర్గం (గండి బాబ్జీ వర్గం) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. అరుపులు, తోపులాటలతో ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. 'మీ అంతు చూస్తాం' 'మీ సంగతి తెలుస్తాం'అంటూ ఇరు పక్షాలు సవాళ్లు విసురుకుంటూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిపోయారు. అయితే అధికార పార్టీ నాయకుల కొట్లాట కావడంతో వెనువెంటనే చర్యలు తీసుకునేందుకు పోలీసులు వెనుకంజ వేశారు. ఈ నేపథ్యంలో కేసులు లేకుండా ఇరు వర్గాలు రాజీ చేసుకునే విధంగా ఆయా వర్గాల పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. కాగా.. గ్రామంలో ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీధి రౌడీల్లా కొట్టుకోవడం చూసి గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆధిపత్యం కోసం ఇరువర్గాలు ఇంతలా దిగజారాలా అని దుమ్మెత్తిపోస్తున్నారు.

భారతీయ మహిళలు ధైర్యవంతులు

జాతీయ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి

విశాఖ విద్య: భారతీయ మహిళలు ఎంతో ధైర్యవంతులని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు ఎస్.విజయభారతి అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో దుర్గాబాయి దేశముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్, ఏబీఆర్ఎస్ఎం-లేడీ టీచర్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం -2025 వర్క్‌షాప్ ఆక్సెలరేట్ యాక్షన్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ విద్యతో సమాజాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. సంస్కారవంతమైన యువతకు తల్లిదండ్రులే కీలకమని చెప్పారు. సమాజం కోసం, దేశం కోసం అనే భావనతో యువత ముందుకెళ్లాలని సూచించారు. వివేకానందుడు కలలుగన్న విధంగా యువతరం ఉజ్వల తారలుగా మారి, తమ ఆశయాలను సాకారం చేసుకోవాలన్నారు. భారత స్వాతంత్ర ఉద్యమంలో మహిళల విజయగాథలను వివరించారు. కార్యక్రమంలో ఆచార్య ఎ.పల్లవి ఆంధ్ర ప్రదేశ్ కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ పి.శ్రీదేవి, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎన్‌హెచ్ఆర్సీ సభ్యురాలు విజయభారతిని వైస్‌ఛాన్సలర్ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు జ్ఞాపిక అందించి, సత్కరించారు.

బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ విజేత విశాఖ ఉక్కు



విన్నర్ ట్రోఫీను అందుకుంటున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ జట్టు

ఉక్కునగరం: జాతీయ స్థాయి ఇంటర్ స్టీల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను విశాఖ స్టీల్‌ప్లాంట్ జట్టు కైవసం చేసుకుంది. స్టీల్‌ప్లాంట్స్ స్పోర్ట్స్ బోర్డు (ఎస్‌పీఎస్‌బీ) ఆధ్వర్యంలో దుర్గాపూర్‌లో మార్చి 3 నుంచి 5 వరకు ఇంటర్ స్టీల్ బ్యాడ్మింటర్ చాంపియన్‌షిప్ 2024–25 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్, దుర్గాపూర్, బిలాయ్, భద్రావతి, బొకారో, సేలం, రూర్కెలా, ఐఎస్‌పీ బర్న్‌పూర్ తదితర 9 జట్లు పాల్గొన్నాయి. బుధవారం దుర్గాపూర్‌తో జరిగిన ఫైనల్స్ పోటీల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ జట్టు చాంపియన్‌షిప్ గెలుపొందింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో దుర్గాపూర్ స్టీల్‌ప్లాంట్ ఈడీ పి.మురుగేషన్ విశాఖ స్టీల్‌ప్లాంట్ జట్టుకు బంగారు పతకం, ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జ్ సీఎండీ ఎ.కె.సక్సేనా విజేతలను అభినందించారు.

వికసించిన అరుదైన ఆర్కిడ్ పుష్పం



బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌లో అరుదైన ఆర్కిడ్ అస్కోసెంట్రమ్ (వాండా) క్రిస్టెన్సోనియం పుష్పం వికసించింది. ఈ పువ్వుతో పార్క్‌నకు అదనపు ఆకర్షణ వచ్చిందని నిర్వాహకుడు రామూర్తి తెలిపారు.

భారతదేశం సనాతన ధర్మానికి పుట్టినిల్లు


ప్రవచనాలు చేస్తున్న కలకాంత్ ప్రభూ

కొమ్మాది: భారత దేశం పుణ్య భూమి అని, సనాతన ధర్మానికి పుట్టినిల్లు అని ఇస్కాన్ వ్యవస్థాపకులు ఆచార్య శ్రీల ప్రభుపాదుల శిష్యుడు, ఆధ్యాత్మిక గురువు హెచ్.జి. కలకాంత్ ప్రభూ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆధ్యాత్మిక అన్వేషనలకు మార్గ నిర్దేశం చేస్తున్న నేపథ్యంలో ఆయన భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో గురువారం సాయంత్రం ఆధ్యాత్మిక ప్రసంగం నిర్వహించారు. భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ ఎంతో అదృష్టవంతులని, ఎన్నో వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, శ్రీమద్భాగవతం వంటివి ఎన్నో భారత దేశం నుంచి ఉద్భవించాయని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని ప్రచారం చేయడంలో ఇస్కాన్ ఎంతగానో ప్రయత్నిస్తోందని, హరినామ సంకీర్తన, సనాతన ధర్మం, భగవంతుని విశిష్టతను ప్రచారం చేయడంలో యువత ముందుకు రావాలని కోరారు. శ్రీకృష్ణుని లీలల నుంచి నేర్చుకోవాల్సిన గుణపాఠాలను, అలాగే అర్జునికి యుద్ధసమయంలో చేసిన గీతోపదేశం ద్వారా మనిషి ఎలా ప్రవర్తించి భగవంతుని చేరుకోవాలనే అంశాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని, వంశీ కృష్ణ ప్రభు, భక్తులు పాల్గొన్నారు.

ప్రణాళికా విభాగం పనితీరు మెరుగుపడాలి

విశాఖ సిటీ: ప్రణాళిక విభాగం పనితీరును మెరుగుపర్చుకోవాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం ఆయన తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. సంస్థ చేపడుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో పనులను వేగవంతం చేయాలని, స్థానిక ఎమ్మెల్యేల సహకారం, సమన్వయంతో ముందుకు సాగా లని సూచించారు. పూర్తయిన పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అదే విధంగా ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, ప్రధాన అర్బన్ ప్లానర్ శిల్ప, ఎస్టేట్ అధికారి దయానిధి, ప్రధాన గణంకాధికారి హరిప్రసాద్, డివిజనల్ అటవీ అధికారి శివానీ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఆర్‌డీ ఆఫీసుకు చంద్రశేఖర్ బదిలీ

మహారాణిపేట : అనకాపల్లి వైద్య ఆరోగ్యశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సిహెచ్.చంద్రశేఖర్‌కు బదిలీ అయింది. చంద్రశేఖర్‌ను వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం(విశాఖ)లో నియమిస్తూ ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

రుషికొండ బీచ్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

కొమ్మాది: ఈ నెలాఖరు నాటికి రుషికొండ బీచ్‌లో బ్లూ ఫ్లాగ్ బృందం పర్యటించనున్న నేపథ్యంలో మౌలిక వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. నిర్వహణ లోపం కారణంగా బ్లూ ఫ్లాగ్ గుర్తింపు రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఎలాగైనా బ్లూ ఫ్లాగ్ గుర్తింపును దక్కించుకోవాలనే లక్ష్యంతో అధికారులు అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. సీసీ కెమెరాలు మరమ్మతులు, బీచ్‌కు వెళ్లే మార్గం మెట్ల నిర్మాణం, పలు చోట్లు గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నట్లు రీజినల్ డైరెక్టర్ జి. జగదీష్ తెలిపారు.

మహిళలపై అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం

- మహిళా చేతన ప్రధాన కార్యదర్శి పద్మ

సీతమ్మధార: మహిళలపై జరుగుతున్న అణచివేత, హింస, దాడులకు వ్యతిరేకంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాలని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహిళా చేతన ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ఇంటా బయటా మహిళలపై అత్యాచారాలు, వేధింపులు, దాడులు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల హక్కుల కోసం రాజ్యాంగం రూపొందించిన చట్టాలను పాలకులు నీరుగారుస్తున్నారని విమర్శించారు. మణిపూర్‌లో జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనమన్నారు. తల్లి, కుమార్తెపై పోలీసులు రోజులు తరబడి అత్యాచారం చేసిన ఘటన, ప్రేమించినందుకు ఓ యువతిని అడవిలోకి తీసుకెళ్లి తండ్రి హత్య చేసిన ఉదంతం వంటి దారుణాలు ఇటీవల జరిగాయని ఆమె గుర్తు చేశారు. కుల రాజకీయాలు, మతతత్వ దాడుల్లో మహిళలు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు పోరాడి సాధించుకున్న గృహ హింస, వరకట్న వేధింపుల చట్టాలను కూడా బలహీనపరుస్తున్నారని ఆందోళన చెందారు. ప్రగతి శీల కార్మిక సమాఖ్య నాయకులు అన్నపూర్ణ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న మహిళా హక్కులను నేడు తిరిగి కాపాడుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చట్టాలను అమలు చేస్తేనే ఇటువంటి ఘటనలు నియంత్రణలోకి వస్తాయని ఆమె స్పష్టం చేశారు. హెచ్ఆర్ఎఫ్ ప్రతినిధి కె.అనురాధ, షాంషాద్ బేగం, లావణ్య, భారత నాస్తిక సమాజం జిల్లా కార్యదర్శి వై. నూకరాజు, రాం ప్రభు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సమానత్వంతోనే సమాజాభివృద్ధి


ర్యాలీలో పాల్గొన్న మహిళా ప్రతినిధులు

సీతమ్మధార : సమానత్వంతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని, మహిళా హక్కులను పోరాడి సాధించుకోవాలని సీఐటీయూ,ఐద్వా, డీవైఎఫ్ఐ ప్రతినిధులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఆశీలుమెట్ట, లలితా జ్యుయలర్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, గురజాడ సెంటర్, సెంట్రల్ పార్కు మీదుగా గాంధీపార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలకు అవకాశాలు ఇస్తే అన్ని రంగాల్లో ముందుకువెళతారన్నారు. నేటికీ చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించడం లేదన్నారు. రాష్ట్రంలో మహిళలపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యాన్ని అరికట్టాల్సిన ప్రభుత్వం దానిని ఆదాయ వనరుగా చూడటం, అదనంగా మద్యం షాపులకు లైసెన్సులు ఇవ్వడం దుర్మార్గం అన్నారు. అంగన్‌వాడీ, ఆశా, ఆర్పీ, హాస్పిటల్, షాప్స్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కుమార్, సీతాలక్ష్మి, వెంకటరెడ్డి, అప్పలరాజు, ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, సంతోష్, వరలక్ష్మి, కె.మణి, వి.ప్రభావతి, లీలావతి, బొట్టా ఈశ్వరమ్మ, కె. కుమారి తదితరులు పాల్గొన్నారు.

బెయిల్‌పై సీపీఐ నేత జేవీఎస్ మూర్తి విడుదల


మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణ మూర్తి

ఆరిలోవ: ఎల్జీ పాలిమర్స్ కేసులో వారం క్రితం అరెస్టయి జైల్‌కు వెళ్లిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తికి బెయిల్ మంజూరైంది. దీంతో ఆయన గురువారం విడుదలయ్యారు. విషయం తెలుసుకొన్న సీపీఐ జిల్లా నాయకులు విశాఖ కేంద్ర కారాగారానికి చేరుకుని ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జేవీ మాట్లాతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న వారిని అరెస్టులు చేసి రిమాండ్‌కు తరలించడం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడమేనని తెలిపారు. కోర్టుకు హాజరైన సమయంలో న్యాయమూర్తి అందుబాటులో లేకపోవడంతో రీకాల్ చేసుకుంటానని చెప్పినా వినకుండా గోపాలపట్నం పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు మాట్లాడుతూదొంగలు, ఇసుక మాఫియా, భూకబ్జాలు, లిక్కర్ మాఫియా చేసేవారు బయట విచ్చలవిడిగా తిరుగుతున్నారన్నారు. అలాంటి వారిని పోలీసులు విడిచిపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు విమల, సత్యనారాయణ, శ్రీనివాస్, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.